# ఇరుకుమాను

"అమ్మా!... అమ్మా!... అయ్యా!... అయ్యా!... అయ్యయ్యో!... మిమ్మల్నేనయ్యా! ఎందుకట్టా అనుమాన పడ్తా అవునో? కాదో? అన్నెట్టుగా చూస్తా అదేందో దోవన బొయ్యే జగడం ఇంటిదాకా ఎందుకనుకోబాకండి. నామణుసు ఎట్టెట్నో మండిపోతా ఉండాది మంటబెట్టి కాల్చినట్టు. నిలిచిన చోట నిలబడలేక... కూచున్న చోట కూచోలేక ఏమి చెయ్యాల్నో తోచకుండా... తోచింది చెయ్యలేకుండా తికమక పడ్తా ఉండాది! ఎవుర్తో పాయ్ చెప్పకోవాల?

నాకర్మ ఇట్టా కాలింది కాబట్టే నా మణుసు తడిగుడ్డను వడేసి పిండినట్టు నలగతా ఉండాది. ఎవుడితో చెప్పకోవాల? అసలు ఒక మణిసి తన బాద ఇంకొకర్తో ఎందుకు చెప్పకుంటాడు? ఎందుకు చెప్పకుంటాడంటే?... మణుసులో బాద అంతో ఇంతో తీరే దానికి. అట్టా తీరాలంటే ఎదిటోడు మన బాదను అర్తం చేసుకోవాల. అయ్యో! పాపం అనుకోవాల.

ఆహాఁ! ఏడ్చే వాళ్లను చూసి నవ్వే వాళ్లుండే ఈ లోకంలో అదేమంత చిన్న పనా?...

మణిసి ఇటుమంటి ఇరకాటంలో పణ్ణెప్పుడు పెద్దోళ్లు మణుసులో మెదల్తారు. అప్పుడు వాళ్ళు చెప్పిన మాట్లు తప్పకుండా గుర్తుకొస్తాయి!.

"ఒరే నాయినలారా! బాదను బయటికి చెప్పకోవాల. వినేవాళ్లు లేకుండాబోతే చెట్టుకు చెప్పకో. అడివిలో పుట్టకు చెప్పకో. అదిగూడా చేతగాక పోతే నీ కొంపలో గోడ ఒకటి ఉండనే ఉండాది గదా?" అని.

అందుకే అయ్యలారా! అమ్మలారా!!-

చేతులెత్తి మొక్కి చెప్తా ఉండా. అదేందో మచ్చు మందు జల్లి మాయజేసినట్లు నేను మాయమాటలు చెప్పలా. నాకు శాతైన కాడికి చెప్తా ఉండా. ఈడు చెప్పేదేంది? మనం ఇనేదేంది? ఇదేందో ముష్టోడి ముక్కుమింద యాష్ట అని కొట్టి పారేయబాకండి! మీకూ బిడ్డలు పాపలుండారు. మీ బిడ్డల్లో నేను ఒక బిడ్డననుకోండి. నేను చెప్పేదంతా శ్రెద్దగా యినండి. ఆమిందట నాది తప్పయితే చెప్పు చేతికి తీసుకోండి!

నాపేరు ఎంగటయ్య. అయితే కొందురు 'ఎంగటా' అంటే ఇంకొందురు 'ఎంగిటిగా' అంటారు.

ఏ ఊరంటారా? - నామాదిరి ఎంగిటిగాళ్లు బతకతా ఉండే కొంపలకు తనీగా పేర్లు ఉంటాయా? ఉండవు. అది ఏ ఊరన్నా కానీ - ఆ ఊరి పేరుకు గొప్పోడి కాలికి చెప్పు తగిలించినట్టు 'మాలాడ' అని మూడచ్చిరాలు తగిలిస్తే అదే ఆ వూరి పేరు అవితింది.

పైడిపల్లి మాలాడ మాఊరు. ఈ పేరు మిందనే మా తాతలు బతికినారు. వాళ్ల తాతలు బతికినారు. నేనూ బతకతా ఉండాను. ఆ మాలాడలోనే. అదే పూరింటిలోనే!

పూరిల్లు అయితే మాత్రం? రెండంకణాల ఎడం.. మూడంకణాల పొడుగు. మా ముత్తాతల కాలంలో ఎట్టున్నిందో ఏమో కాని మా తాతల కాలంలో మాత్రం బెమ్మాడంగా ఉన్నిందంట. మా తాత ఇండ్లు కప్పేదాంట్లో ఆ పాయకట్లోనే పేరు పొయ్‌నోడంట. తట్టుడ పలక చేతబట్టి అయన ఇల్లెక్కితే ఈగెజారిపడిపొయ్యేంత సుద్దంగా కప్పేవాడంట. మా యిల్లు మా తాత కప్పింది కదా? మా అయ్య తరంలో ఇల్లు ఎక్కాల్సిన పనే లేక పొయ్యింది. నాతరం కూడా అట్టా గడ్చిపొయ్యేదే. అయితే నాలుగు చినుకులు రాల్తే మాత్రం శానా యిబ్బంది. ఉరుపెత్తుకుంటింది. చట్టి ఒకచోట... బాన ఇంకొకచోట... ముంత ఒకచోట... మూకుడొక చోట పెట్టాల్సిందే!

ఈ పూరి కొంపమీద ఇంత బాగోతం చెప్పాల్సిన పనే ఉండేది కాదు. బిడ్డెకు పెండ్లి పెట్టుకున్నా. నాకు బుద్ది తెల్సినాక ఇదే ఇంట్లో జరగతా ఉండే మొదటి సుబకార్నెం. అయినోళ్లు ఏలెత్తి చూపించకుండా ఇంటి మిందట్టా వొచ్చిందీ పొయ్యిందీ సర్సేసుకుందామంటే మోపు బోదకసువు దొరికే కుందికి చావుజంపులైపాయ. అదిగూడా అట్టా పోనీ - బోదకసువు గాకుండా బోతే వరి కసువు. ఇల్లు ఉరవకుంటే చాలు!

అదిగాదే ఇప్పుడొచ్చిన బాద. బిడ్డను చూసేదానికి శానంబట్లోళ్లు వస్తా ఉండారు. వాళ్లు అంతో ఇంతో ఎసులుబాటు ఉన్నోళ్లు. చిన్నదానికంటారా? మూతీ ముక్కు సక్కరంగా ఉండాదని మునాస పణ్ణారు. అటుమంటోళ్ళు వస్తే కాసింత మరేదగా చూడల్ల గదా?- చూడాలంటే కొంపలో పిడికెడు వడ్లగింజిలు లేవు. సంకటో సలిబిండో పెట్టి సాగనంపేద్దామంటే ఎల్తిగా ఉంటింది. ఏం చెయ్యాల్నో మీరే చెప్పండి.? -

'ఏమీ చెయ్యలేము' అనుకున్నెప్పుడు నా బోటోడు చెయ్యగలిగింది వాడికి శాతనయ్యింది వొగిటే పని! అది కలిగినోళ్ల కాళ్ళు పట్టుకుండేదే! -

ఎంచిచూస్తే వియ్యాలోళ్ళు వచ్చేదానికి మూడే మూడు దినాలు లేవు. నాకా ఎనకా ముందూ ఎవురూ లేరు. అన్ని పన్లూ ఈ వొంటి చేతిమిందనే జరగాల. ముందుగా మూడు కుంచాల వడ్ల గింజలు కొంప జేర్తే మల్ల ఎట్లన్నా అవితిందని ఊరి మింద పణ్ణా.

చిన్నప్పుడు యిస్కూలికి పొమ్మని మా అయ్య ఎంతెంతో సతపోర్తే నేను ఇసికలోకి పొయ్‌నానంట ఆట్లాడుకునేదానికి. పలకా బలపం ఎత్తుకోరా! అంటే నేను నేరుగా రెడ్డోరింటికి పొయ్ పేడ తట్ట నెత్తికెత్తు కున్నానంట! చిన్నప్పటి నుంచి రెడ్డోరి ఇల్లంటే నాకంత గురి. అందుకే అట్టా ఇట్లా చూడకుండా ఆ ఇంటికే పొయ్‌నా!

నేనంటే వల్ల మాల్నె అబిమానం రెడ్డమ్మకు. ఉణ్ణెమాట ఉణ్ణెట్టే చెప్పుకోవాల గదా? ఇప్పుడే గాదు ఎప్పుడన్నా సరే. నేనా ఇంటి గడప తొక్కతానే - "రారా! రారా! ఎంగిటిగా. నిండా నూరేండ్లురా నీకు. నీమాటే అనుకుంటా ఉంటే నువ్వే వచ్చేస్తివి. కాకమ్మ ఏమన్నా కబురందించిందా? రారా!" అనేది నవ్వతా. ఆ మాటల్తో నేను మెలికలు తిరిగిపోతా నిలబడుకోనుంటే - 'పొయ్యిలోకి ఒక్క పుల్లఉంటే నీమిందొట్టురా!' అంటా గొడ్డలి దెచ్చి చేతికిచ్చేది. ఇంకచూస్కో నా సామిరంగా! - అది చేవదేరిన చింతకొమ్మయినా సరే! చంద్రమాకైనా సరే! పేళ్ళు పేళ్ళుగా చీలిపోవాల్సిందే! ఆమిందట రెడ్డమ్మకు వారం దినాలు పొయ్యిలోకి పుల్లంటా తడుముకుండే పనే ఉండదు. ఆడికి ఇడ్సిపెట్టదే పుణ్ణాత్తురాలు!

'ఒరే ఒరే! ఆ చేతుల్తోనే ఆ చేందారం అట్టందుకోరా" అంటింది. నీళ్ళు చేదేవాణ్ణి. రెడ్డోరింటికి నీళ్ళు చేదేది నువ్వా? అని సందేహపడబాకండి. నేను చేత్తా ఉంటే రెడ్డమ్మ అ పక్కన నిలబడుకోని అంది పోసుకుండేది. నిజం చెప్పొద్దూ! రెడ్డమ్మ మొకం జూసుకుంటూ నీళ్ళు చేదేదంటే నాకు శానాకుశాల! బాయిలో ఒక్క చుక్క నీళ్ళు లేకుండా చేది పొయ్యమంటే గూడా ఎనకాడేవాణ్ణి కాదు!

ఏమాట కామాట చెప్పుకోవాల గదా? పాపం ఆమె గూడా ఎనకా ముందు చూడకుండా కుండ అడుగు గిడుగు గీకి మాడో మశాణమో రొండు దోసిళ్ళు సద్దినీళ్ళు గూడా పోసేదనుకోండి. అట్టాంటి మణిసి 'శానా దూరం వచ్చేసినావే?' అనే కుందికి మాట శానా దూరం పొయ్యింది. అయినా ఏం చెయ్యాల? - మినకరిస్తా నిలబడుకుంటి!

"ఏమిరా సంగతి ఎంగిటిగా?" అని అడిగె రెడ్డమ్మ.

"బిడ్డకు పెండ్లి పెట్టుకుణ్ణానమ్మా!"

ఆమాట చెవల్లో పడేకుందికి రెడ్డమ్మ ఒక్క ఊపులో ముందుకు లేచి కోటేసిన అరిచేతుల్తో కాలిమింద మోకాల్ని పట్టుకోని కూసుండె. అప్పుడు చూడాల రెడ్డోరింటి ఎచ్చులు- నిజంగా రెడ్డమ్మ మొకంలో చెండుమల్లెలై పూసినాయి. నాకు శానా కుశాలేసె!-

"ఎక్కడిదిరా సంబంధం?"

"శానంబట్ల మాలాడమ్మా"

"కొత్త సంబందమా?... పాతదేనా?"

"కొత్తదేనమ్మా!"

"అదే ఈ పొద్దు నీ మొకం చూస్తానే అనుకుణ్ణా ఏదో విశేషం ఉండాల" అని. ఆ మాట అంటా రెడ్డమ్మ ముసి ముసిగా నవ్వె. మాయబ్బ సాచ్చిగా చెప్తా వుండా. వచ్చిన పని అవితిందనుకొని నాకు వెయ్యేనుగుల బలం వచ్చె. అందుకే- 'ఏంకావాల్రా ఎంగిటిగా?' అని అడిగితిందేమో అని ఎదుర్సూస్తా నిలబడుకుణ్ణా. రెడ్డమ్మ వాలుకుర్చీలో వాటంగా ఎనక్కీ ముందుకు ఊగతా ఉండాది ఊగులాడే నామణుసుతో పోటీపడ్తా. ఎంతసేపని ఎదురు చూసేది? అందుకే నేనే కలగ జేసుకుణ్ణా!

"రేపు లేదు ఎల్లుండి శానంబట్లోళ్లు వస్తా ఉండారమ్మా పిల్లదాన్ని చూసేదానికి. కొంపలో

పిడికిడంటే పిడికిడు వడ్లగింజిల్లేవు. సంకటో పాడో కెలెకేద్దామంటే ఏం బాగుంటింది? ఒక్క మూడు కుంచాల వడ్లు కొల్సియ్యండమ్మా. ఏదో ఒక పని జేసి చెల్లకడ్తాను.”చేతులు పిసుక్కుంటానే చెప్పాల్సింది చెప్పేసినా.

గలగల నవ్వేసి రెడ్డమ్మ - “నీచేతికడ్డంలేదు పాయ్ చూసుకోబోరా ఎంగిటిగా! విడిగా ఒక్క గింజి లేదు. గాదెల్లో పోసి మెత్తులేసి ఉండాం. దరలు చూస్తే అగ్గిబడిపోతా ఉండాయి. ఏం చెయ్యమంటావ్ చెప్పు? మెత్తులు తీసేదానికి ఎట్లయితిందిప్పుడు? తీసినప్పుడు కావాలంటే రారా. మూడు కుంచాలు కాకపోతే ఆరు కుంచాలు తీసుకోని పోదువు. నీకిస్తే యాడికి పోతాయ్?”'

నిజమే గదా? ఒక్కపూట యిడవకుండా బానకు బాన తోలి పండించిన పంటాయె. ఒగిటికి సగంగా దారబొయ్‌మంటే ఎవుడికి మాత్రం మణుసు వొప్పితింది? నాకు అవసరం వచ్చిందని మత్తేబుల్ని మెత్తులు తీయమంటే తీస్తారా? - ఇట్టనుకునే కుందికి మల్లా నోరు తెర్చేదానికి నా వల్లగాలా. ఈణ్ణే యిట్టయితే ఇంకెట్లాబ్బా? అనుకునేకుందికి నాకు గుండెల్లో రాయి బణ్ణెట్టాయ! -

వంచిన తలెత్తకుండా రెడ్డోరింటి గడప దాట్తి. నేరుగా ఎగవ వీదిలో ఎర్రమనాయుడింటికి ఎలబార్తి!-

ఎర్రమనాయుడోళ్లకి ఏడెనిమిది మడకల సేద్దిం. నాలుగు కీనీరు బావలకింద చూపు అన్నెంత దూరం బూములు. బాయి బాయికి కరంటు మిసిన్. ఇరుగారూ పంటలు పండతానే ఉంటాయి. దినమ్మా పది ఇరవై మందికి తక్కవ లేకుండా కూలోళ్ళు పని చేస్తానే ఉంటారు. ఆ ఇంట్లో అడుగు పెత్తే ఏ పనీ చేతగాని ఎరిముండగ్గూడా ఏదో ఒక పని చెయ్యాలనిపిస్తింది. ఆ ఇంట్లో దూడలకు ముగుజింబరాలు మొదులుకోని ఎద్దలకు ఎంటిక దారాల దాకా పేడిచ్చింది నేనే. అండగొట్టి అడుసు దున్నింది మొదలుకోని పైరు కోసి తాలుగొట్టేదాకా పాలామారకుండా పని చేసింది నేనే. నేనంటే నాయుడికి గానీ నాయుడమ్మకు గానీ శానా యిష్టం!

నేను ఆ ఇంట్లో అడుగు పెట్టేటప్పుటికి అవులేళ దాట్తా ఉండాది. యాడోళ్ళాడ పన్లమింద పొయ్యుండారు. ఇల్లు బిసురోమని ఉండాది. చావిట్లో నిలబడుకోని నాయుడు నాయుడమ్మతో సరసాలాడ్తా ఉండాడు. నన్ను చూస్తానే నాయుడమ్మ నవ్వతా ఇంట్లోకి జారుకుండె.

నాలో నేను నవ్వుకుంటూ తలొంచుకొని నిలబడుకుంటి!.

“ఏమిరా ఎంగటా?... వేళగాని వేళకాడ దిగబడ్తివే?” అదొక మాదిరిగా నన్ను చూస్తా నాయుడు అడిగె.

చెప్పేదానికి నోరాడక చేతులు నలుపుకుంటా నిలబడ్తే -

“ఒరే నీయమ్మా బడవా! రానూ వస్తివి. మీ యమ్మను తరమనూ తరిమేస్తివి. గుటకలు మింగాల్సింది నేనైతే నువ్వెందుకురా అట్టామాదిరి నసగతా ఉండావే? చల్లబడేటప్పుడు బాన పగిలిపాయ్‌నట్లాయనే కత!” అంటా మిద్దె ఎగిరిపొయ్యేటట్టు నవ్వతా ఉండాడు నాయుడు.

చెయ్యరాని తప్పుజేసినట్టు నేనేమో మెలికలు తిరిగిపోతా వుంటే మల్లా నాయుడమ్మ నవ్వతా చావిట్లోకొచ్చె.

"అదునూ పొదును పాయ్‌నాక నామొగుడు రాయి సేద్దిగాడు అన్నెట్టుంది యవ్వారం. పనీపాటా వొదిలేసి యాళా పాళా లేని ఈ సరసాలు చాల్నాలు గానీ... అడికి నిలుపు నీ యాసణ్ణం!' ' అంటా నాయుడమ్మ కోపం జేసుకుణ్ణెట్టు గానే కండ్లల్లో కనకాంబరాలు పూయించె. ఎర్రమనాయుడు జెర్రిపోతు మాదిర మెలికలు తిరిగిపోతా ఉండాడు. నాకూ శానా తెంపు కలిగె వచ్చిన యాళ బాగుండాదని!-

"అయన కతలు అడికి ఉండనీ గానీ... నువ్వు వచ్చిన పని చెప్పరా ఎంగటా?" అనె నాయుడమ్మ.

చెప్పితి.

నాయుడు ఇరగబడి నవ్వతా - "ఊరకే అన్నారంట్రా మీకంతా బుద్దుండేది మోకాళ్లలోనే అని. అట్టపాయ్ చూడరాదా మడికయ్యలమింద తాలు. ఎక్కడి దాడ పడుండాది. దినానికి ఇరవై ముప్పై మంది కోత కోస్తా ఉండారే! కండ్లు దొబ్బినాయా? వడ్లగింజలు కావాలని ఇప్పుడు ఇంటికాడకొచ్చినావే?" అని మెత్తగా నాలుగు అంటించె.

"నువ్వు చెప్పేది బలే బాగుండాదే కత? - వాడి అవసరం వాడిది. ఇల్లు అన్నాక పాత వడ్లేమన్నా ఉంటాయి అనుకోనుంటాడు. ఉణ్ణి గింజలు వచ్చేపొయ్యే వాళ్ళకు వార్చి పోసేదానికి సరిపోయ్ నాయని వాడికేమన్నా వాసనగొట్టిందా? ఉత్త పుణ్ణానికి వాడి మిందట్టా ఇర్సక పడ్తా ఉండావే? ఒరే ఎంగటా? ఆయన్తో ఏం పనిగానీ తాలుగొట్టేటప్పుడు రారా కళ్లంకాడికి. రొండు తూములు గాకుండా బోతే పందుం పట్టుకోని పోదువు"

నాయుడమ్మకు నేనంటే శానా ఇష్టం. అంతకు ఇంతకు అడ్డం చెప్పే మణిసి కాదు. ఇంతకూ నా తలరాత అట్టా రాసి పెట్టుంటే ఎవురేం జేస్తారు?

అక్కడ నుండి ఎలబార్నా. గడపదాటి అడుగు బయటపెడ్తా వుండా. "ఒరేఎంగటా! పిల్ల దానికి పెండ్లి బెమ్మాండంగా చెయ్యాల్రే!" అంటా పకపక నవ్వతా ఉండాడు నాయుడు.

ఎలిక్కి పాణం పోతా వుంటే పిల్లి చెలగాటమాడిందంట. ఆట్టుండాది కత. వియ్యాపోళ్ళు బిడ్డను చూసేదాని కొస్తాఉంటే నాలుగు మెతుకులు వార్చిపెట్లేని ముదనష్టపోణ్ణి! ఇంకెట్లా పెండ్లి బెమ్మాండంగా చెయ్‌బోతా?

ఇట్లా ఆలోచించుకుంటానే ఆ ఊళ్ళో ఎక్కి దిగని గడప లేదంటా ఎక్కి దిగినా. యాడికి పాయ్‌నా పొద్దు ఎదురే! ఆ పాయకట్లో రెడ్డోరు నాయుడోళ్లంటే పేరెత్తినోళ్ళు. ఆ ఇండ్లల్లో ఎలికల్ని అడిగితే చెప్తాయి. ఎన్నేండ్ల గింజలు ఇరుపుండేది. అటుమంటి చోట్లోనే బతుకు ఏమాయ? - తెల్లారి పోలా? -

ఇదంతా అయ్యేపని కాదనుకుణ్ణా. ఎట్లన్నా కాళ్లావేళ్లా పడి కోమటి సిద్దయ్య తావన నాలుగు పళ్లు నూకలు అప్పు చేస్తే ఆపూటకు అట్టట్టా చుట్టు పట్లుగా సరిపోతాయనుకుణ్ణా. కోమటాయన ఇంటికాడికి పాయ్‌నా.

అంగిడి మూసేసి ఈదిలో తిన్నె మింద రొండు చేతులు నెత్తిన బెట్టుకొని కూసోని ఉండాడు కోమిటి సిద్దయ్య. ఆయన మొకం చూస్తాఉంటే నాకే ఏడుపు వచ్చేటట్లుగా ఉండాది. అందుకే

అడిగేదానికి నోరు రాక అట్లానే నిలబడుకున్నా.

యాపారం జేసే మణిసికదా? ఎందుకొచ్చింది పసికట్నాడు.

"ఒరే ఎంగటయ్యా! దొరికి దొరికీ ఈ సేల్ టాక్సోళ్లకి నేనే దొరికినాను గదరా? యదవన్నర యదవలు. వేల్లు వేల్లుగా యాపారాలు చేసుకుంటా మీసాలు మెలేస్తా ఉండే మొగలాయిలు ఎందురో ఉండేవాళ్లు ఉండంగా వొచ్చొచ్చి ఈ ఉప్పూ మిరపకాయలు అమ్ముకునే వాడి మింద పడ్తారా? అంగిడి మూసేమన్రి. చిత్తు కాగితాల్ని చూస్తే గాడ్దిలు కూడా తిన్నంటాయి. ఆ చిత్తు కాగితాలు దొరికిందే చాలన్నెట్లుగా జవురుకోని చేతి సంచుల్లో కుక్కుకోని చక్కా పొయ్‌రి గదరా? వచ్చిన బేరాలు పోతా ఉండాయి. నీబోటోళ్ళు ఎవురైనా వచ్చి అంత అప్పో సప్పో అడిగితే ఇయ్యాలంటే గూడా చేతులు కట్టేసినట్లయిపాయ. ఏమి చెయ్యమంటావురా ఎంగటయ్యా?"

ఏడవకుండానే కోమిటాయన ఏడ్చినంత పని జేసె! పాపం ఆయన బాద ఆయనిది.

ఆయన ఏడుపు చూల్లేక... చూస్తా కూడాఏడవలేక అణ్ణుంచి ఎలబార్నా.

"మొగోడు ఊళ్లోకి పొయ్‌నాడుకదా? ఎట్నో ఒకట్టా మూడు కుంచాలు పొట్టు గింజలు పుట్టించుకొని రాక పోతాడా? ఈ గెండమట్టా గడ్సి గెడ్డనపడకుండా బోతామా?" అని ఇంట్లో ఆడది ఎదురు చూస్తా ఉణ్ణెట్టుంది. నన్ను చూస్తానే లేచి ఎదురుగా వచ్చింది మూట దించుకుందామన్న మునాసతో. మాడిపొయ్‌న నా మొకం చూసేకుందికి దాని మూతి మూడు వొంపులు తిరిగె!

ఏం చేయ్యమంటారు చెప్పండి?....దాని బాద దానిది.

ఆ బాద చూల్లేక నేనేందో తప్పుచేసినట్టు తలొంచుకొని నిలబడ్తి.

"ఏం మొగోడమ్మా ఈమొగోడు? ఇరం పరం లేని మొగోడు. నిద్దర కండ్లల్లో పెట్టుకొని ఎలబారిపొయ్ పొద్దు తిరిగేదాకా తిరిగి తిరిగి ఇప్పుడొస్తావుండాడు చేతులు ఊపుకుంటా. మల్లా చూడు. ఆ రెడ్డోరన్నా నాయుడోళ్ళన్నా గెవిన్లో నిలడుకోని అట్టా ఎలుగిస్తే చాలు. ఎగబెట్టుకొని పరిగిత్తాడు. ఇంతకూ దాని తల్రాత అట్ట రాసింది. నా కడుపు ఇట్టా కాల్తా ఉండాది. కోతికైనా గీత చక్కంగా ఉండాలంటారు పెద్దోళ్ళు. రేపు అట్టా పొద్దు గూట్లోపడ్తే ఎల్లుండి తెల్లారే కాడికి వాళ్లొచ్చేస్తారు. వచ్చేస్తే నేనేం చెయ్యాల? నాతాడు తెంచి వాళ్ల చేతల్లో పెట్టాల!"

దాని మాట తగలాల్సిన చోట తగిలే కుందికి చురక్కుమనె! ఇంకాడ నిలబల్లేక గిరక్కుమని ఎనక్కి తిరిగినా. అట్టా తిరిగినానో లేదో గబక్కని నాచెయ్యి పట్టుకుండె నా ఇంట్లోడ్ది.

"ఎండనబడి యాడేడ తిరిగినావో ఏంపాడో? ఏతల్లయినా దయతల్చి రొండు దోసిళ్ళు సద్దినీళ్లయినా పోసిందో లేదో?... మన ఎర్రి గాని పన్లు ఉండేటప్పుటి స్రెద్ద మనకు పనిబణ్ణెప్పుడు ఉంటిందా? ఏదెట్లా జరగాల్నో అట్నే జరిగితింది కానీ - నువ్వు కాళ్ల చేతులు కడుక్కో. సంగటి కెలికినా. గురుగాకు పులగూర పామినా. అంత గొంతులో యేసుకొని మల్లా గావాలంటే యాడికైనా పో!"

కోపం వస్తే తాడు తెంచేస్తాననేదీ ఆడదే!- మణిసిని అట్టా ఇట్టా కదలకుండా తాడుతో కట్టేసినట్టు మాటల్తోనే కట్టేసేదీ ఆడదే! అదే ఆలోచించుకుంటా మూకుడు ముందర కూసుణ్ణా!

జొన్న సంగటికి గురుగాకు పులగూర బలే పక్కంగా ఉండాది. రొండు ముద్దలంటే ఒక లెక్క లేకుండా లగాయించేవాణ్ణి. అటుమంటిది ఒక్క ముద్ద నంజి నంజి తినేటప్పిటికి దేవుళ్ళు దిగొచ్చినంత పనయింది!

ఇంటి మొగదాల్నే ఒక చింత చెట్టు. బాగా చిగిరించింది. ఆ చెట్టు కిందొక మంచం. అది గూడా తాతలు సంపాయించిందే! దారాలు బాగా సల్లొదిలి పొయ్యుండాయి. పొయ్ పొణుకున్నా. ఉయ్యాల్లో ఊగినట్టుండాది. ముసుగేసుకున్నా. అయినా మణుసు ఇంట్లో ఆడది అనే మాట్లకేమో ముసుగెయ్యలేక పోతావుండాది! ఆమాట్లు తూట్లు పొడస్తా ఉండాయి. మర్చిపోదామంటే మరుపు రాలా!

"రేపు లేదంటే ఎల్లుండి వాళ్లొచ్చేస్తారు. వచ్చేస్తే ఏం జెయ్యాల? నాతాడు దెంచి వాళ్ల చేతల్లో పెట్టాల!" ఎంతమాట? ఆమాట వొళ్లంతా కారం పూసినట్టు మంట పెట్టా ఉంటే ఆమంచంలో అట్ట పొల్తా ఇట్ట పొల్తా ఎప్పుడు కన్ను మూసినానో నాకే తెల్దు!

మెలకువ వచ్చేకుందికి కన్నీగిటి పడ్తా ఉండాది!

"జల్మమెత్తి పుట్టే సరిపోతిందా? కొంచిమైనా సిగ్గూ చీమూ ఉండక్కర్లే? పొద్దు పుట్టే దెంత సేపు?పొయ్యేదెంతసేపు? ఈ పొద్దట్టా పుట్టి మునిగిందంటే తెల్లార్తింది. తెల్లార్తే వాళ్లొచ్చేస్తారు. వచ్చేస్తే ఏం జెయ్యాల? కొంపలోబడి మింగలేక కక్కలేక చస్తా ఉంటే ఈ మొగోడికి నిద్దర కూడా పట్టింది గదమ్మా?" పెళ్లో కుండలూ చట్లూ కడుక్కుంటా నన్నూ కడిగేస్తా ఉండాది మా ఆడది!

తుండు గుడ్డెత్తి బుజాన వేసుకోని ఏలబార్నా!

కాలుగాల్నె పిల్లి మాదిర ఆడతిరిగినా. ఈడ తిరిగినా. ఒకదోవా తోడూ లేకుండా ఎట్టపట్తే అట్ట తిరిగినా. అట్టా తిరగతా ఉంటే నామణుసు మరగతానే ఉండాది. ఎట్ట తిరిగినా ఎంత ఆలోచించినా ఏమి చెయ్యాల్నో తోచలా. తోచలేదని చేతులు పిసుక్కుంటా కూసుంటే వచ్చిన సంబందం చెయ్యిదాటి పోతింది. అప్పుడేం జెయ్యాల?

అంతలోనే పాలారబోసినట్టు వెన్నెలొచ్చె!

అప్పుడు నేను నాగలమిట్ట బాయికాడ నడస్తా ఉండా.

ఆ వెన్నెల్ని తాగేసి ఆకుశాల్లో వొకడిమిందొకరు పణ్ణెట్టుగా మడి కయ్యల్లో వరిపైరు యిరగపండి అట్లానే వాలబడి ఉండాది. నాయుడోళ్ల వరితాలు వాదెలు వాదెలుగా పడుండాది. ఇదంతా చూసేకుందికి నా కొక ఆలోచన తట్టె!

"ఎవురి కంట్లో పడకుండా రొండు మూడు కుంచాల వడ్లు పులుంకుంటే?..."

"చీ చీ! చెయ్యబొయ్యేది సుబకార్నెమూ...చేసేది దొంగతనమా? అంతకన్నా పొయ్ యాడన్నా ఒక నీళ్లేని బాయిలో పడి చావచ్చు. అట్లనుకుంటే నూరు బొంకులైనా బొంకి ఒక పెండ్లి చెయ్యమన్నారు పెద్దోళ్లు! అటుమంటప్పుడు ఒక చిన్న దొంగతనం చేస్తే కొంపలే మైనా అంటక పోబోతాయా?

అట్లనుకుంటే-ఆర్నెల్ల కిందట వాళ్లింట్లో పట్టపాగులే దొంగలు పడ్డి. అందురు చూస్తానే

ఉండారు. ఇంటిని చుట్టేసిరి. తుపాకులు చూపించిరి. కదిలితే కాలస్తామని బెదిరించిరి. దొర్ల మాదిర ఇనప్పెట్టె తెరిపించి బాండ్లూ దుగ్గాండ్లు దోచుకోని పాయ్రి. ఎవుడేం జేసినాడు? అది దొంగతనం కానప్పుడు ఇదెట్లా అవితింది?

నామతి మండిపోనూ...ఇది ఇంకా బాగుండాదే? వాళ్లకు బలం ఉణ్ణింది. చేతుల్లో తుపాకులుండె. కండ్ల ముందర్నే చెప్పి చేసిరి. నాబోటి ఎరిముండకు ఏముండాది? అవసరం ఉండాది! అవసరం ఉంటే మాత్రం? కాయ కష్టం చేసి బతికే జల్మాలకు కను కత్తరించేది తెలిస్తింది?

అట్లయితే ఇంకెట్టా?

ఇంకెట్టా?...ఇంకెట్టా అని కూసుంటే తెల్లారి పోతింది. తెల్లార్తే వాళ్లు రానేవస్తారు. వచ్చేస్తే ఏం చెయ్యాల? ఎట్నో ఒకట్టా పరువు కాపాడుకోవాల!

దేవుడు ఎట్టన్నా పెట్టనీ. మూడు నాలుగు కుంచాలు పులుంకోవాల్సిందే!

జామురేత్రి కావస్తా ఉండాది. ఇంకా ఆడాడ మణిసీమత్రా మెదల్తానే ఉండారు. అందుకే నాగలమిట్ట బాయి గెడ్డ మింద కూసుణ్ణా! ఆ గెడ్డ శానా ఎత్తుగా ఉండాది. అంత ఎత్తులో కూసుంటే గాలి చల్లంగా ఈస్తా ఉండాది. ఆగాలివాటంగా ఆలోచన్లు సాగతా ఉండాయి.

నాయుడోళ్ల మడిలో అండగొట్టి అడుసు దున్నింది నేనే. రెడ్డోరికి పైరు నాటించి కలుపు తీయించింది నేనే. గొల్ల గోయిందు కయ్యల్లో పైరు పొట్టకర్ర కొస్తాఉంటే చీడ తగిలిందని ఏడస్తా ఉంటే మందు కొట్టింది నేనే. అయినేరోళ్ల కరంటు మిసిన్ చెడిపోతే దాన్ని రిపేరు చేసుకోని వచ్చేదాకా పైరు ఎండిపోకుండా మోట తోలిందీ నేనే! ఈ పొద్దు వరిమళ్లను చూస్తా ఉంటే కడుపు అట్నే నిండిపోతా ఉండాదంటే రెడ్డోరు రేపటెండ మొకం చూడకుండా పాయ్నా...నాయుడు నాయుడమ్మతో సరసాలాడ్తా కూసుణ్ణా చెమటోడ్చింది నేనే! నాబోటోళ్లే! వాళ్లేమో వొంటికి సెగ దగలకుండా చేతికంత మట్టి గాకుండా గాదెలు బొట్టలు మెత్తులేసుకుంటా ఉంటే గొంతుమింది కొచ్చినపుడు ఒక్కొక్క కయ్యలో రొండు పళ్ల పొట్టు గింజిలు పులుంకుంటే కొంప లేమన్నా మునిగిపోబోతాయా? వాళ్లకేమన్నా కూటికి గుడ్డకు లోటైపోబోతిందా!

ఇట్లా అనుకునే కుందికి నాకు ఎక్కడలేని తెంపు వచ్చె!

లేచినా. అట్టా ఇట్టా చూసినా! చూపు ఆన్నెంతదూరం చూసినా! పురుగు మెదల్లేదు. తలపైకెత్తి చూసినా. చుక్క నడిమిట్ట కొచ్చింది! అదే అదుననుకుణ్ణా.

నాగలమిట్ట బాయి కిందంతా ఎర్రమనాయుడోళ్ల మళ్లే. ఆ కయ్యల్ని అట్టా దాటుకుంటే రెడ్డోరిమడి. ఆ పక్కన్నే గొల్ల గోయిందు కయ్య. ఆ కయ్యల కవతల్నే అయినేరోళ్ల మడి. ఒక్కొక్కరి కయ్యలో రెండు పళ్లు. చాల్నాలనుకుణ్ణా. గబ గబా గెడ్డ దిగినా. ఒక్క ఊపులో పొయ్ నాయుడోళ్ల కయ్యల మింద పణ్ణా. రొండు వాదెలు పులుంకునే కుందికి కొంచెం ఎచ్చూ తక్కవగా కుంచం గింజలు రాలె. ఆడికి చాలనుకోని రెడ్డోరి మడిమింద పణ్ణా. ఆడకూడా ఒక కుంచానికి తక్కవ లేకుండా పులుంకుణ్ణా. గొల్లగోయిందు కయ్యలో పొయ్పడి వొంచిన తలెత్తకుండా పులుంకుంటా ఉండా!

ఉణ్ణెట్టుండి నాబుజం మింద రొండు చేతులుపడె. నిలవనా నీళ్లు గారిపాయ్‌నా. అంత చల్లపూట గూడా వొళ్లంతా చెమట్లు పట్టె. గొంతు ఎండకపాయ. లెయ్యాలనుకుంటా ఉంటే రొండు రెక్కలు పట్టుకోని పైకి లేపినారు లెయ్‌లేనోణ్ణి పైకి లేపినట్లుగా!

చూద్దును గదా? గొల్లగోయిందు కొడుకు సిద్దయ్య. గంగయ్య. అంతరేత్రిపూట యాడున్నారో ఏంపాడో? చెరొక రెట్టా వొడ్సి పట్టుకోని గసపోస్తా ఉండారు! నిజం చెప్పొద్దూ? ఇదిలించి కొట్టుంటే ఇట్టాకడు అట్టాకడు ఆమడకొకడుగా పాయ్ పడుండేవాళ్లు. ఏమైపోయిందో ఏమో నా సెగితి. వాళ్ల చేతుల్లో పిల్లి అయిపాయ్‌నా. పులిమిన వడ్లు 'కట్రామూట'! అని. కట్టి. 'నడవరా ఊళ్లోకి' అని. నడిస్తి. ఊళ్లో బజన గుడికాడి కొచ్చేటప్పటికి 'పెట్రా మూట ఆడ!' అని. పెట్టి.

అంతే. అన్నాదమ్ముళ్లిద్దరూ అమాంతంగా పైన బడి రెక్కలు ఎనక్కించి రాతికూసానికి కట్టేసిరి. నేను నోరు తెర్సవుంటే ఒట్టు!

ఆ మిందట ఈ చెంపా ఆచెంపా అదరగొట్టిరి. ఎగిరెగిరి తన్నిరి. కారిమొకాన ఊసిరి. ఆడిక్కూడా కుదట పడకుండా 'అప్పడే ఏమయ్‌పొయిందిరా నీ పని. తెల్లార్తే చూద్దువుగానీ రా నా కొడకా!' అంటా అక్కడ గుడ్డేసి పొణుకుండ్రి.

ఊరు నిద్దరపోతా ఉండాది!

గుళ్లో దేముడు కూడా నిద్దరపోతా ఉండాడు!!

కారాలు మిరియాలు నూరతా కాకరించి ఊస్తా ఉణ్ణె గొల్లగోయిందు కొడుకులు కూడా గురక పెట్టా ఉండారు. రాతి కూసానికేసి కట్టేసినారని నేను బాదపళ్లా. ఎగిరెగిరి తన్నినారని ఏడవలా. కారి కారి ఊసిరే అని తపన పళ్లా. తెల్లార్తే ఊళ్లో వాళ్ల మొకం ఎట్టా చూసేది? తల్చుకుంటేనే తలకొట్టేసినట్టవతా ఉండాది. ఎట్టబ్బా తెల్లార్తే?

అట్లని నా కోసరం తెల్లారకుండా ఉంటిందా?

పటం ఎగరబోతా ఉండాది. అప్పడు పూజారి వొచ్చె. నన్ను చూసి అట్నే నిలబడిపాయ!

"ఇదేంది వెంగటయ్యా? ఊళ్లోవాళ్లకంతా నమ్మినబంటువే? కళ్లాల కాడ కావిలి అంటే నిన్నే పెట్టా ఉండిరే. అటుమంటోడికి ఇదేం బతుకయ్యా?... కంచే చేను మేసిన కతాయనే. ఏమి కాలమో కలికాలం?" అంటా నిట్టూర్చె.

గొల్లగోయిందు కొడుకులు కొట్టింది చీమ కుట్టినట్లనిపించలా. ఈ మాట్లు వింటావుంటే ఈటెల్తో పొడిసినట్లుండాది.

బోరోమని ఏడ్చేసినా.

"ఏడవద్దు నాయనా ఏడవద్దు. తలరాత. దాన్ని తప్పించుకుండే దానికి ఎవరి తరం." అని గొణుక్కుంటూ పూజారి గుళ్లోకి పాయ!

గొల్ల గోయిందు కొడుకులు ఇద్దురు ఎగిరిపడి లేచిరి. తుండుగుడ్డలు ఇదిలించి బుజం మిందేసుకోని ఒకరొక పక్కకు ఇంకొకరొక పక్కకు పరిగెత్తిరి.

ఇంక జరగబోయేదేందో నాకు తెల్సు!

ఊళ్లో ఇంటికొక్క మనిసిగా వొచ్చి గుడికాడ చేర్తా వుండారు.

"ఒరేయ్ ఎంగటా! వొరె వొరే! నీకేం పొయ్యేకాలం వచ్చిందిరా! - ఊళ్లో మంచోడు అనిపించుకుండేదానికి ఎంతకాలం పట్టె? అదెంతా ఇప్పుడేమాయె?.అయ్యయ్యో! అయినా ఇదేందిరా ఇట్టాంటి పని చేసినావే?"

"ఎంత మంచోడైతే మాత్రం ఏంజేసేది? జాతి బుద్ధి పొమ్మంటే పోతిందా? కొట్టాల్సిన పనిలే. తిట్టాల్సిన పనిలే. ఈ నాకొడకల మింద చెయ్‌చేసుకుంటే దోవనబొయ్యేది ఇంటి దాకా తెచ్చుకున్నట్టే. కంప్లీటొకటి రాసి టేసిన్ లో ఇచ్చేస్తే చెయ్యాల్సింది వాళ్లే చేస్తారు. తోడుకు ఇంకేందైనా ఒక దొంగతనం కూడా తగిలిస్తే కొడుకు అత్తగారింట్లో అయిదార్నెల్లు ఉండొస్తే అప్పుడొస్తింది బుద్ధి."

"టేసిన్ కు పన్లే. పాడూ పన్లే. ఇట్లా పాడు పని ఇంక చెయ్యబాకరా అని మెట్టుతీసుకోని తలా ఒక్క ఏటు కొట్టే సరిపోతింది."

"నువ్వు నేను అనుకుంటే ఏంలాభం? ఊరి నాయం ఒకటుండాది గదా? శీపరం వాళ్ల చిన్నమరెడ్డి ఏమంటాడో?"

అడజేరినవాళ్లు తలకొక్క తీరుగా మాట్లాడతా ఉండారు. అంతలో చిన్నమరెడ్డి రానే వొచ్చె! నన్ను చూసి పక పకా నవ్వె!

ఆ పొద్దుటితో నాతలరాత చినిగి పొయ్యిందనుకుంటి.

నాకళ్లల్లో నీళ్లు పలపలా రాలె!

"ఏడస్తావెందుకురా ఎర్రి నాయాలా? అట్లనుకుంటే ఈ దేశింలో శానామంది ఏడవాల. ఏనాకొడుకు ఏడస్తా ఉండాడు చెప్పండి. ఓట్లేసి గెలిపించి పంపిస్తే కొడుకులు పట్టపొగులే నిన్ను నన్ను నిలబెట్టి వొల్చుకోని తింటా ఉండారే? వాళ్లను నిలదీసేదానికి ఏ యదవకు దమ్ములుండాయి? తినేదానికి సరిగ్గా తిండి ఉండదు. కట్టుకునే దానికి గుడ్డా ఉండదు. రాజకీయం గాలి తగిలేకుందికి ఒక్కొక్కడు మత్తేబులై కులకతా ఉండారే? ఈ కండ్లతోనే చూస్తా ఏంజెయ్యగలగతా ఉండాం? వీడేంది? నాలుగు పళ్లు పొట్టుగింజలకు కక్కుర్తి పడితే ఏమో కొంపలే మునిగిపొయ్‌నట్టు ఎగిరెగిరి పడ్తా ఉండారే. చాలు చాలు గానీ ఇడ్చిపెట్టండ్రా!"

దేవుని సాచ్చిగా చెప్తా ఉండా. గుళ్లో ఉండే ఆ దేముడిక్కూడా ఆ సెగితి లేదు. రెడ్డయ్య నోట్లో మాట నోట్లో ఉండగానే నా కట్లు ఇప్పేసిరి!

తలొంచుకోని నిలబడుకుంటి.

"ఇప్పుడిక్కడ ఏం కొంపలంటుకోని పొలేదు. గోరంతలు కొండంతల చేసుకోవాల్సిన పనేమీ లేదు. ఇంకా తలొంచుకొని నిలబడ్తావెందుకురా? ఆమూట ఎత్తుకోరా. ఏమీ జరగలేదనుకోని తిరిగిచూడకుండా పొయ్ కొంప జేరుకోరా!" అనె.

మహన్నబావుడు 'తిరిగిచూడకుండా పోరా!' అని నాకు చెప్పి ఆయన తిరిగి చూడకుండా ఎలబారి పొయ. ఆయనే అట్లా పొయ్యేకుందికి ఊళ్లో వాళ్లు ఎట్టొచ్చినోళ్లు అట్టానే పొయ్‌రి.

మూటెత్తి నెత్తినబెట్టుకున్నా. అయితే ఇంటికి పొయ్యేదానికి కాళ్ళాడలా. నేరుగా రెడ్డింటికే ఎలబారిపోతి.

మారాజు చావిట్లో కాలిమింద కాలేసుకోని కార్వేటినగరం మారాజు మాదిరి కొలువుతీరి ఉండాడు.

మూట ఎత్తుకొని పోయ్ ఆయన ముందర పెత్తి.

కాళ్లమింద పడి దణ్ణం పెత్తి!

"లెయ్‌రా పిచ్చోడా! లెయ్!!" అనె.

లేచి రెండడుగులు ఎనక్కేసి చేతులు కట్టుకోని నిలబడుకుంటి.

నామొకంలోకి మొకం పెట్టి నన్నే చూస్తా ఉంటే నాకు తల వాలిపాయ. అప్పుడు రెడ్డి చూపు వడ్లమూట మిందపడె. ఆ మూటేమో ఆడ దించి ఈడ దించి ఎత్తుకుండే కుందికి యాడిదాడ ఈడి పొయ్యుండాది.

"మూట సరిగ్గా కట్టుకోరా!" అనె రెడ్డయ్య.

కట్టుకుంటి.

"ఒరే పిచ్చోడా! చాతగానమ్మకు చెవుకాడ కొప్పు అన్నారు. ఈ రొండు మూడు కుంచాల వడ్ల గింజలు ఒకే కయ్యలో పులుంకోనుంటే పోలేదంట్రా. ఇన్ని కయ్యల్లోకి ఎందుకు పోయ్‌నావురా? చేతకాని ఎరిముండా?- .... నాయానికి పొయ్ ఆన్నాయంగా ఇరుక్కోని పోతివి గదరా?"

సత్తి పెమాణకంగా చెప్తా ఉండా. నా తలకాయట్లానే తిరిగిపాయ. రెండుమూడు కయ్యల్లో గింజిలు పులుముకుణ్ణింది నాకు పైనుండే వాడికి తప్పిస్తే నర మానవుడికి తెల్దు. అటుమంటిది. ఎట్ల పసిగట్నాడో కట్నాడు మొనగోడు. అందుకే గదా జుట్లు పట్టిస్తాడు. ఎట్లా పట్టిస్తాడో ఎవుడికి తెల్దు. మల్లా ఇడిపిస్తాడు. అదిగూడా ఎవుడికీ తెల్దు. అటుమంటి మొగలాయి ఆ పాయికట్టునంతా అరచేతిలో పెట్టుకోమంటే పెట్టుకోడా... అదే ఆలోచించుకుంటా ఉంటే -

"యామారితే అందరూ దొంగ నాకొడుకులేరా? - చెప్పేది శ్రీరంగ నీతులు. దూరేది దొమ్మర గుడిసెలు. ఆమాటకొస్తే ఈ దేశింలో వాడి నోరు ఈడు. ఈడినోరు వాడు కొట్టకుండా బతికే నాయాలెవుడుండాడ్రా? - ఇదంతా నువ్వేమి మనసులో పెట్టుకోబాక. మూటెత్తుకోని పోరా!... పో!"

వెయ్యేనిగిల బలం వచ్చేసింది నాకా మాట్లింటా వుంటే! - వొంగి వొంగి దణ్ణాలు పెట్టినా. మూటెత్తి బుజాన పెట్టుకోని ఎలబార్నా. ఆ ఇంటి గడప దాటతా ఉండా!

"ఒరే వెంగటా!"

ఆయన పిల్చేకుందికి నిలబడ్తి. ఆయన కల్లా తిరిగి చూస్తి.

"ఇంటికి పోతానే నీ కూతుర్ని ఒకసారిట్టా ఇంటికి పంపించు రే!"

పెద్ద గుండు నా గుండెల్లో పడినట్లాయె. నిలదొక్కుకోని నిలబడలేకపోతి. అట్లానే నిలువుగుడ్లేసి చూస్తాఉంటే - చిన్నమరెడ్డి ముసిముసిగా నవ్వుకుంటా వుండాడు. ఎట్లా చెప్పేదానికి నోరాడకుండా చూపు అట్టా ఇట్టా తిప్పకుండా చూస్తా ఉండా!

"ఎందుకురా అట్టా బావురు పిల్లి చూసినట్టు చూస్తా ఉండావే? ఇప్పుడేం కొంపలు మునిగిపాయ్ నాయని. మీ అమ్మ ఊళ్లో లేకుండా వారం దినాలయిపాయ. ఇంట్లో పని చేసేది

కూడా జరం తగిలిందని ఆసిపత్రిలో పొణుకోనుండాది. ఇంట్లో ఆడదిక్కు లేకుండా ఇంట్లో ఒంట్లో ఎట్టెట్నో ఉండాది. పోరా పో. తొందరగా పొయ్ దాన్నిట్టా పంపించు. హ్వాహ్వాహ్వా! దాన్ని ఈడెవురూ పెరుక్కోని తినబొయ్యేది లేదుగానీ పోరా!"

ఆకండ్లల్లో కొవ్వు... ఆ పెదాల మీద నవ్వు - చూస్తాఉంటే వాడు పెరుక్కోని తింటాడో? లేదో? తెల్సి పోతానే ఉండాది.

ఒక్క సెణం అడ నిలబడలేకుండా వొచ్చేసినా.

ఇప్పుడేం చెయ్యాల?... ఎవురితో చెప్పుకోవాల?... తలెత్తుకోని తిరగలేకుండా సతమతమై పోతావుంటే తలపోసుకుండే దానికి తావెక్కడ దొరికితింది? -

నర మానవుడిమింద నమ్మకం పొయ్యింది. కాలేమో నిలబళ్ళా. కడుపేమో రగల్తా ఉండాది. ఏంజేసేది? - పేదోడికీ కోపానికీ ఎక్కడా ఎప్పుడూ చుక్కెదురే?

ఉణ్ణెట్టుండి నాకొక ఆలోచన తట్టింది. ఆట్టా ఇట్లా చూడకుండా పరిగెత్తినా. మాతల్లి మారెమ్మ గుడి కాడికి పరిగెత్తినా. వడ్ల గింజల మూట తల్లి పాదాల కాడ పెట్నా. సాష్టాంగ పణ్ణా!

అమ్మా! మారెమ్మతల్లీ! నాబిడ్డను అత్తగారింటికి పంపించాలనుకుణ్ణా. నా కర్మగాలి నేనే అత్తగారింటికి పొయ్యే గెతి పట్టింది. అది ఎట్నో ఒకట్టా తప్పిపొయ్యిందనుకుంటే - ఆ బిడ్డను ఇంకొకడింటికి పంపాల్సి వొచ్చింది. నువ్వే చెప్పు తల్లీ! నేను కన్నానా? కక్కినానా? - పీట్లమిందికి పంపాల్సిన బిడ్డను తెల్సి తెల్సి వాడి నోట్లో ఎట్లెయ్యమంటావమ్మా? - అంతకంటే చచ్చేది మేలుగాదా? వాడి పడకమిందికి పంపించలేను. పంపించకుండా ఈ ఊళ్ళో బతకలేను. ఈ ఊరుగాకపోతే ఇంకొక ఊరు అనుకునేదానికవితిందా? - నీ పాదాలను నమ్ముకుణ్ణెట్టే ఈ మట్టిని నమ్ముకుంటి. ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు చెప్పుతల్లీ!

ఆతల్లి ముందర పడి అల్లాడతా పొల్లాడతా ఉండా. ఆ అల్లాటం పొల్లాటంలో నిమ్మకాయ చెక్కిన పట్టాకత్తి నా ముందర పడె!

ఆకత్తిని చూసేకుందికి నాకు ఎక్కడలేని ధైర్యం వొచ్చేసింది.

కండ్లల్లో పలపలా నీళ్ళుగార్తా ఉండాయి - సంతోసంతో!

"అమ్మా మారెమ్మతల్లీ! ఇది నా మాటగాదు. నీ మాటే తల్లీ. ఇది నా బుద్ధికాదు. నువ్విచ్చిన బుద్దే తల్లీ! ఇంక నాబిడ్డ నాబిడ్డ గాదు. నీబిడ్డ తల్లీ! ఉత్తర్వు యిచ్చినావు గదమ్మా! ఇంక నాకేం బయం?"

కత్తి చేతికి తీసుకుణ్ణా!

అయ్యలారా!... అమ్మలారా!!...

పాలన్నం తినే పరమాత్తుళ్లు మీరు! మంచి చెడ్డా తెలిసిన మహన్నబావులు మీరు!

చెప్పండి. మీరే చెప్పండి! నాది తప్పైతే చెప్పు చేతికి తీసుకోండి!...

*-ఆంధ్రభూమి (5-8-1982)*